క్లుప్తంగా

250 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతపల్లి: మండలం అంజలీశనివారం పంచాయతీలోని తామరాపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో హెల్పేజ్ ఇండియా, రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ సంస్థల ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. విశాఖలోని వివిధ కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి వచ్చిన వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు సాయికృష్ణ, కృష్ణకుసుమ, మహాలక్ష్మి, రాఘవేంద్ర, ప్రావీణ్య, లక్ష్మి, శాంతి ప్రియ, విజయ్ శ్రీరాం, ధనలక్ష్మి, సంధ్య, స్టేట్ ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: అడ్డతీగలలోని వేంచేసిన ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారితో పాటు ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త రాము తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నదాన సమారాధన నిర్వహించారు.

పోక్సో చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రమణ

అడ్డతీగల: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై న్యాయవాది కె.ఎస్.వి.రమణ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన అవసరమన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలకు పోక్సో యాక్ట్ చట్టపరమైన రక్షణను కల్పించిందన్నారు. ఎటువంటి వేధింపులకు గురైనా చట్టం బాలికల పట్ల అండగా ఉంటుందన్నారు. దీనిపై సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. పలు న్యాయపరమైన అంశాలను వివరించారు.

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి


గిరిరైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్

చింతపల్లి: రైతులు విధిగా తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని రత్నగిరికాలనీ, బయలుకించంగి గ్రామాల్లో రైతులకు పలు అంశాలపై ఆయన శుక్రవారం అవగాహన కల్పించారు. పంటరుణాలు, పీఎం కిసాన్ తదితర పథకాల గురించి వివరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సూరంపాలెం వద్ద ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం వద్ద నర్సీపట్నం నుంచి కాకినాడ వెళ్తున్న ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సూరంపాలెం వద్ద శుక్రవారం జాతీయ రహదారికి చెందిన ఫుట్‌పాత్‌ను ఢీకొట్టింది. దీంతో బస్ యాక్సిల్ విరిగిపోయి పెద్ద కుదుపుతో నిలిచిపోయింది. ఆ సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉంచిన చింతపండు


ఎండబెట్టిన చింతపండు

అటవీ ఉత్పత్తులకు గిరాకీ

చింతపండు సేకరణలో గిరిజనులు నిమగ్నం

దళారుల బెడదతో ఇక్కట్లు

రూ.40లకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది జీసీసీ చింతపండును కొనుగోలుకు ఇంకా మద్దతు ధరలు నిర్ణయించలేదు.దీంతో గిరిజన రైతులు దళారులను

దుంబ్రిగుడ: మండలంలోని గిరిజనులు చింతపండు సేకరణలో నిమగ్నమయ్యారు. 18 గ్రామ పంచాయతీల్లో ఈఏడాది చింతపండు అధిక మొత్తంలో కాపురావడంతో ఏ గ్రామంలో చూసినా గిరిజన రైతులు చింతపండు సేకరించి వారపు సంతలకు విక్రయించేందుకు ఎగబడుతున్నారు. మన్యం చింతపండుకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంది. యువకులు చెట్లు ఎక్కి చింతపండును దులుపుతుంటే వాటిని మహిళలు సేకరిస్తున్నారు. అనంతరం ఎండబెడుతున్నారు. కొంతమంది మహిళలు ఎండబెట్టిన చింతపండును కర్రల సహాయంతో కొట్టి పోట్టును తొలగిస్తు చింతపండును వేరు చేస్తున్నారు. ప్రస్తుతం వారపు సంతల్లో చింతపండు మొదటి రకం కిలో రూ.50లు, రెండో రకం కిలో రూ.35 నుంచి రూ.40లకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది జీసీసీ చింతపండును కొనుగోలుకు ఇంకా మద్దతు ధరలు నిర్ణయించలేదు.దీంతో గిరిజన రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు . జీసీసీ అధికారులు స్పందించి ఈ ఏడాది చింతపండును కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

కాంగు పిక్కలకు డిమాండ్

మండలంలోని గిరి రైతులు కాంగు పిక్కల సేకరణలో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది కాంగు పిక్కలు అధిక మొత్తంలో కాపురావడంతో వారపు సంతలకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. యువకులు చెట్లు ఎక్కి పిక్కలను దులుపుతుంటే వాటిని మహిళలు సేకరించి ఎండబెట్టి తొక్కను తొలగించే పనులు చేస్తున్నారు. కాంగు పిక్కల నుంచి సేకరించిన నూనెను బాలింతలు మసాజ్ ఆయిల్‌గా వినియోగిస్తారు. చిన్నారులకు ఎటువంటి చర్మ వ్యాధులు రాకుండా వాడుతారు. ప్రస్తుతం వారపు సంతల్లో కాంగు పిక్కల మొదటి రకం కిలో రూ.50లు, రెండో రకం రూ.35లకు మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ అధికారులు స్పందించి కాంగు పిక్కల కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.


ఆరబెట్టిన చింతపండు తొక్కను తొలగిస్తున్న గిరిజన మహిళ


ఆరబెట్టిన కాంగు పిక్కలు


సేకరించిన కాంగు పిక్కలను తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు

అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


గుమ్మపుట్టులో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

పాడేరు రూరల్: పదేళ్లుగా నిర్మాణ దశలో అంగన్‌వాడీ భవనం అనే శీర్షికతో ఈ నెల 28న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై సీడీపీవో ఝాన్సీరాణి స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుమ్మపుట్టు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నిధులు అందక పోవడంతో నిర్మాణ పనులు పిల్లర్ల దశ వరకు నిలిచిపోయిందన్నారు. భవన నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.8.50 లక్షలకు ప్రతిపాదలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించి అంగన్‌వాడీ కేంద్రం అందుబాటులోకి తీసుకోస్తామని చెప్పారు.

సీతారాముల కల్యాణ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని అరుకు ఎమ్మెల్యే స్వగ్రామమైన కొంతిలిలో వచ్చే నెల 4,5,6 తేదీల్లో నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాల పోస్టర్‌ను శుక్రవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తిశ్రద్ధలతో పండగను నిర్వహించాలని గ్రామస్తులను ఆయన కోరారు.
సర్పంచ్ రేగం రమేష్, అరుకు నియోజకవర్గ పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు రేగం శివరామకృష్ణ, నాయకులు అప్పలస్వామి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


కొళాయిని ప్రారంభిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎంపీపీ రాజుబాబు, చిత్రంలో అధికారులు

హుకుంపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసే తాగునీటి పథకాలను స్థానికులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, గిరిజనులకు రక్షణ కల్పించడంతో పాటు అన్ని విధాలుగా పోలీస్ శాఖ అండగా ఉంటుందని సీఐ సన్యాసినాయుడు చెప్పారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం మండలంలోని శోభకోట పంచాయతీ కాంగండువ గ్రామంలో ఆర్‌డబ్ల్యూస్ శాఖ సహకారంతో తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు స్థానిక ఎంపీపీ కూడా రాజుబాబు తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దుస్తులు, యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనచోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు రక్షణ కల్పించడంతో సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎంపీడీవో రమాదేవి, ఎస్‌ఐ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి జగదీష్‌బాబు, సర్పంచ్ శశిభూషణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర


ఘటాల ఊరేగింపులో భక్తులు

చింతపల్లి: గొందిపాకలులో నూకాలమ్మ తల్లి జాతర శుక్రవారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో భక్తులు అమ్మవారి ఘటాలను ఊరేగించారు. గ్రామంలో అన్నసమారాధన చేశారు. జాతర సందర్భంగా గ్రామంలో పలు వినోద కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం


ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు

పాడేరు : వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబును పార్టీ అధిష్టానం ప్రకటించింది. వరుసగా రెండోసారి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సీదరి రాంబాబు, స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి అన్ని వర్గాల వారిని కలుపుకొని పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి నిత్యం సిద్ధంగా ఉండాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు దూసురి సన్యాసిరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మాజీ సర్పంచ్‌లు పాంగి నాగరాజు, మినుముల కన్నపాత్రుడు, కుంతూరు బొంజుబాబు, నాయకులు రామారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన కోసం వినతి

రాజవొమ్మంగి: మండలకేంద్రంలోని శివారులో నిత్యం ఉధృతంగా ప్రవహించే వట్టిగెడ్డ వాగుపై వంతెన నిర్మించాలని స్థానికులు శుక్రవారం పాడేరులో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వర్షాకాలంలో ఈ వాగు పొంగినప్పుడు ఉధృతి తగ్గే వరకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వినతిలో పేర్కొన్నారు. రాజవొమ్మంగి నుంచి వయ్యేడు, బూరుగపల్లి, ముర్లవానిపాలెం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఈ వాగు మార్గ మధ్యలో పెద్ద ప్రతిబంధకంగా మారిందని కలెక్టర్‌ను స్వయంగా కలసి వివరించారు. అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్ సానుకూలంగా ప్రతిస్పందించారని, వీలైంత త్వరలో ఈ వాగుపై వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారని దూసరపాము మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా నుర్మని మత్స్యకొండం నాయుడు నియామకంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికైన మత్స్యకొండంనాయుడు , నేతలతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.


ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమం


చింతూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి


జి.మాడుగులలో మాట్లాడుతున్న సీడీపీవో సువర్ణమ్మ

చింతూరు: పోషణ్ భీ.. పఢాయి భీ కార్యక్రమానికి సంబంధించి చింతూరులో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో విజయగౌరి మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలకు సంరక్షణ, ప్రీ ప్రైమరీ విద్య, పోషకాహారం పంపిణీ అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. సూపర్‌వైజర్లు ప్రియాంక, సంఘమిత్ర, సత్యవతి, పార్వతి పాల్గొన్నారు.

జి.మాడుగుల: పోషణ్ భీ.. పఢాయి భీ కార్యక్రమానికి సంబంధించి జి.మాడుగులలో మూడు రోజల పాటు నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సీడీపీవో సువర్ణమ్మ మాట్లాడుతూ ప్రీస్కూల్ కార్యక్రమాలు, శారీరక అభివృద్ధి పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య బోధన తదితర అంశాలపై శిక్షణ అందించారు. సుజాత, విజయలక్ష్మి, సత్యవతి, పద్మావతి, లక్ష్మి, మణికుమారి, కొండమ్మ పాల్గొన్నారు.

జీసీసీ ఎండీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


మాట్లాడుతున్న సర్పంచ్‌లు, తదితరులు

అరకులోయటౌన్: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణికి పార్లమెంట్‌లో జరిగిన అవమానానికి జీసీసీ ఎండీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు కొర్రా రాధిక, గుబాయి కళావతి, బుటికి, సుభద్ర డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవంలో ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణికి ఆహ్వానించకపోవడం దారుణమన్నారు. కూటమి నేతలు ప్రతిపక్షాలపై వివక్ష కనబరుస్తున్నారన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులను ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధిత నియోజకవర్గానికి చెందిన వారిని ఆహ్వానించకుండా అవమానపరచడం సరికాదన్నారు. ఇకనైనా అధికార పక్షాలు పద్ధతి మార్చుకోవాలన్నారు. నాయకులు కిరణ్, గోపాల్, జీనబంధు, బాలరాజు, ఏలిష్, తిరుపతి, వెంకటరావు, సోమేష్, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

మునగపాక: నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి మునగపాకలో ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఘటాల ఊరేగింపు గ్రామంలో అన్ని వీధుల మీదుగా ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం దగా


ర్యాలీ చేస్తున్న సీపీఎం నేతలు, గిరిజనులు


తహసీల్దార్ నర్సమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తికి వినతి ఇస్తున్న నేతలు

ముంచంగిపుట్టు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం దగా చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో మహిళలు శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలమం వద్ద ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, పీఎం జన్‌మన్ గృహాలకు రూ.10లక్షలు నిధులు మంజూరు చేయాలని, హౌసింగ్‌లో అక్రమ వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించాలని అంటూ పలు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా మండల పార్టీ కార్యదర్శి త్రినాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించి, ప్రజలను నానా అవస్థలకు గురి చేస్తుందన్నారు. తాగునీటి కోసం గిరిజన గ్రామాల్లో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు కావడం లేదని, ఉపాధి కూలీలకు వేతన బకాయిలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలతో గిరిజనులు ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవడం దారుణం అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, తహసీల్దార్ నర్సమ్మలకు అందజేశారు. నేతలు శ్రీను, నర్సయ్య, శంకర్‌రావు, నారాయణ, జీనబంధు, నర్సింగరావు, లైకోన్, గణపతి, ఈశ్వరి, విజయ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు


గసభలో బోరుకు రిపేరు చేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మహేష్ తెలిపారు. గసభ పంచాయతీ నువ్వగుడ,మొర్రిగుడ, గసభ గ్రామాల్లో పాడైన బోరులకు మరమ్మతు చేయించినట్టు చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గుంటగన్నేల పంచాయతీ డోమంగి గ్రామంలో నూతన బోరింగును ఏర్పాటు చేశామన్నారు. మెకానిక్‌లు అప్పన్న, జగన్నాథం తదితరులు రిపేరు పనులు చేశారు.

1 నుంచి ఇంటర్ తరగతులు

పాడేరు రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇంటర్ సెకండియర్ తరగతులు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7 నుంచి కళాశాలలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. వసతి గృహం నిర్వహణ కోసం వార్డెనర్లు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: మండలంలోని మర్రివాడ పంచాయతీ లూసం, బూదరాళ్ల పంచాయతీ సాకులపాలెంలో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి గంజాయి అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్య నేరమన్నారు. గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయికి బదులు వాణిజ్య పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉన్నచోడి, సామ, కొర్రలు వంటి తృణధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఎండన్న, సతీష్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి


ముంచంగిపుట్టులో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

ముంచంగిపుట్టు: పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలని, పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పాస్టర్స్ ఫెలోషిప్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. హోలీ క్రీడా మైదానం నుంచి పలు వీధుల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పాస్టర్లు సురేష్, మోహన్, బర్నబాష్, అర్జున్, రత్నమణిలు మాట్లాడుతూ ఇటీవల తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలోని దివానుచెరువు వద్ద జరిగిన ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి చెందినట్టు చెబుతున్నా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇది రోడ్డు ప్రమాదమా లేక హత్య అనే కోణాలపై ప్రభుత్వం దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం క్రైస్తవుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి తగు న్యాయం చేయాలని కోరారు. పాస్టర్లు సుభాష్, రాందాసు, అనిల్, ప్రసాద్, అధిక సంఖ్యల్లో తదితరులు పాల్గొన్నారు.